క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరులో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.నెల్లూరు కిమ్స్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి సీఐ రామారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక కౌన్సిలర్, వైస్‌చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి ప్రతి రెండు నెలలకోసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం దాదాపు వంద మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ లలితారెడ్డి, వైద్యులు హారిక, నాయకులు కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పీటీఎఫ్ జిల్లా కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు (టౌన్): పూలే టీచర్స్ ఫెడరేషన్ (పీటీఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. రైల్వేస్టేషన్ సమీపంలోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా నరేంద్ర, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రసాద్, ఉపాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, శివనాగు, కిషోర్, మహిళా కార్యదర్శులుగా భారతి, సుదీప్ణ, కవిత, భారతి, కార్యదర్శులుగా సుధీర్, జయరామయ్య, వెంకటరమణయ్య, రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సురేష్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా పీటీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు శ్రీనివాసులు వ్యవహరించారు.

వైద్య సిబ్బందికి శిక్షణ

నెల్లూరు(బారకాసు): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో శనివారం నిర్వహించారు. హ్యాండ్స్ అండ్ ట్రెనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా బేసిక్ కార్డియో పల్మనరీ లైఫ్ సపోర్ట్ (బీసీఎల్ఎస్)పై ఆస్పత్రిలోని అనస్థీషియా విభాగంలో శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, డీపీఎంఓ హరిశ్చంద్రసతీష్, వైద్యాధికారి బ్రహ్మేశ్వర్, అనస్థీషియా విభాగ హెడ్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ జమున, కో ఆర్డినేటర్ సురేష్, అసోసియేట్ ప్రొఫెసర్ ఉమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ మధుప్రియ పాల్గొన్నారు.

2న ప్రతిభ పురస్కారాల ప్రదానం

నెల్లూరు(వేదాయపాళెం): పదో తరగతి పరీక్షల్లో 500కుపైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను జూన్ రెండున అందజేయనున్నామని యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాదాల వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పొగతోటలోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. విజయమహల్ గేట్ సమీపంలోని ఎమ్మీఎస్ కల్యాణ మండపంలో పురస్కారాలను అందజేయనున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని, వివరాలకు 97058 00794, 94406 33704 నంబర్లను సంప్రదించాలని సూచించారు. యాదవ భవన్ ట్రస్ట్ చైర్మన్ నాగకిశోర్, యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు మధుసూదన్‌రావు, రాజేష్, రమణయ్య, కొండయ్య, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్ వర్ధంతి సభ నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డాక్టర్ విజయ్‌కుమార్ వర్ధంతి సభను ఆదివారం నిర్వహించనున్నామని జీవీకే ట్రస్ట్ సభ్యుడు నారాయణ పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని విజయ్‌కుమార్ మెమోరియల్ ట్రస్ట్ భవనంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని దేవిశెట్టి స్వాములు, రాజేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రజాసంఘాలు, మేధావులు హాజరుకావాలని కోరారు. ట్రస్ట్ సభ్యులు బ్రాహ్మణి, అబ్బయ్యరెడ్డి, మాల్యాద్రి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా ఆదివారం పనిచేయనున్నాయని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం సాకారం

- వలంటీర్ వ్యవస్థను కించపరిచిన చంద్రబాబు, లోకేశ్
- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సాకారానికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు పురస్కారాలు అందజేసి ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ముందు చూపుతో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చారని తెలిపారు. ఈ వ్యవస్థలతో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతుండడంతో సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గతంలో చంద్రబాబు, లోకేశ్ వలంటీర్ వ్యవస్థను పలుమార్లు చులకనగా మాట్లాడారని గుర్తుచేశారు. వలంటీర్లు ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, మనకు ప్రజలకు సేవ చేయడమే ముఖ్యమన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు సీఎం వైఎస్ జగన్‌కు రెండు కళ్లు అని పేర్కొన్నారు.రెండు వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలకు మరువలేనివన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది పురస్కారాలతో సత్కరిస్తోందన్నారు. వలంటీర్లు సేవాభావంతో పని చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్‌చైర్‌పర్సన్ లలిత, వైస్‌చైర్మన్ షాహుల్, ఎంపీపీ శ్రీనివాసులు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, పీ సుబ్రహ్మణ్యంనాయుడు, ఎం మురళి, పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి రహిత పాలన



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సాగుతోందని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 8,9 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు నియోజకవర్గంలోని 63 సచివాలయాల పరిధిలో 73 వేలకుపైగా ఇళ్లను సందర్శించామని తెలిపారు.

రెండు ఆర్వో ప్లాంట్లు ప్రారంభం

నగర పంచాయతీ పరిధిలోని 9,10 వార్డుల్లో ఎంపీ నిధులతో నిర్మించిన ఆర్వో ప్లాంట్లను ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రారంభించారు. 9వ వార్డులో ఆర్వో ప్లాంటుకు తెలంగాణ రాష్ట్రం నిజామబాద్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్‌రెడ్డి రూ.7 లక్షలు కేటాయించారని చెప్పారు. 10వ వార్డులో ఆర్వో ప్లాంటుకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు రూ.7 లక్షలు విడుదల చేశారని చెప్పారు. ఇద్దరు ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.3 లక్షల చెక్కుల అందజేత

బుచ్చిరెడ్డిపాళెం కోఆపరేటివ్ బ్యాంకుకు చెందిన కామన్ గుడ్ ఫండ్ నుంచి నెహ్రూనగర్‌కు రూ.లక్ష, బుచ్చిరెడ్డిపాళెంలోని గాంధీనగర్‌కు రూ.2లక్షలు కేటాయించినట్లు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ మేనకూరు సీతారామిరెడ్డిని అభినందించారు. కౌన్సిలర్లు నస్రీన్, శివకుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, యానాదిరెడ్డి, ప్రసాద్, జయంతి, అనంతమ్మ, ప్రత్యూష, నాయకులు ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చాందిని, అల్లాబక్షు, డాక్టర్ అల్లాబక్షు, చిన్నఅల్లాబక్షు పాల్గొన్నారు.

పరామర్శ

గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కిందపడి గాయపడిన సచివాలయ ఉద్యోగి పూజితను ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆమెను తన కారులో నెల్లూరులోని ఇంటికి పంపించి మానత్వం చాటుకున్నారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నం పంచాయతీ రామ్‌నగర్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ఉదయం 11 గంటలకు పర్యటించనున్నట్లు స్థానిక నాయకుడు రాగాల వెంకటేశ్వర్లు తెలిపారు. రామ్‌నగర్‌లో మత్స్యకారులు నిర్వహించే తిరునాళ్లలో మంత్రి పాల్గొంటారని చెప్పారు.

వివాదాస్పద భూమి సర్వే

ఇందుకూరుపేట: డేవిస్‌పేటలోని వివాదాస్పద భూమిని జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీరామమూర్తి, మండల సర్వేయర్ హరనాథ్ శనివారం సర్వే చేశారు. ఈ ప్రాంతంలో ఎస్తేరురాణి అనే మహిళ నిర్మాణాలు చేపట్టేందుకు యత్నించగా, స్థానికులు దేవాదాయశాఖకు చెందిన భూమి అని అడ్డుకున్నారు. దీంతో ఆమె అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు భూమి దేవాదాయశాఖకు చెందినదా..కాదా అనే కోణంలో సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సై వెంకటరాజేష్ పర్యవేక్షించారు.

బస్టాండ్‌లో సెబ్ అధికారుల తనిఖీలు



పొదలకూరు : స్థానిక పంచాయతీ బస్టాండ్ పరిసరాల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారని స్పందనలో వినతిపత్రం అందడంతో పొదలకూరు సెబ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. బస్టాండ్‌లోని కూల్ డ్రింక్ షాపులు, వెలుపుల కూరగాయల తోపుడు బండ్లను తనిఖీ చేశారు. ఎటువంటి అక్రమ మద్యం లభ్యం కాలేదని సెబ్ సీఐ వెంకట్రావు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎస్సై సీహెచ్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు వందనం

ఇందుకూరుపేట: మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేంద్రబాబు శనివారం తెలిపారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవా మిత్ర పురస్కారాలను ప్రదానం చేస్తారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి

వెంకటాచలం: అనారోగ్య సమస్యతో గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. వివరాలు..తాటిపర్తి పాళేనికి చెందిన సింగర శీనయ్య భార్య శ్యామలమ్మ(50) వీఆర్ఏగా పనిచేస్తోంది. గత ఐదేళ్లుగా శ్యామలమ్మ కీళ్ల నొప్పులతో బాధపడుతూ తరచూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతోంది. కీళ్ల నొప్పులు తట్టుకోలేక ఈ నెల 22న ఉదయం ఇంట్లోఎవరూ లేని సమయంలో గుళికలు మింగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్యామలమ్మ శనివారం మృతి చెందింది. భర్త శీనయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొడవలూరు: చంద్రశేఖరపురంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల కళాశాలలో ఇంటర్(సీబీఎస్ఈ) ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఎస్టీ బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ రాణి మందా, గురుకులం ప్రిన్సిపల్ టీ విష్ణుప్రియ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్ఈసీలో 25, ఎంపీసీలో 3, బైపీసీలో 3 సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. ఆసక్తి కలిగిన బాలికలు నెలాఖరులోగా www. aptwgurukalam. ap. gob. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయించనున్నట్లు చెప్పారు. జూన్ మొదటి వారంలో విద్యార్థుల మెరిట్ జాబితాను ప్రచురిస్తామని తెలిపారు.

నేటి నుంచి జ్వాలాముఖి ఉత్సవాలు



విద్యుద్దీప కాంతుల్లో జ్వాలాముఖి ఆలయం

తోటపల్లిగూడూరు: వరిగొండలో కొలువైన జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో వార్షిక ఉత్సవాలను ఆదివారం నుంచి 30వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ ఆలయ చైర్మన్ కోసూరు రవీంద్రయ్య శనివారం తెలిపారు. తొలిరోజు ఉదయం విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధనతో వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. అమ్మవారికి పూలంగి సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం అమ్మవారికి పల్లకిసేవ, మంగళవారం లక్ష కుంకుమార్చన, పల్లకిసేవ నిర్వహించనున్నట్లు వివరించారు. తొలిరోజు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.


రేపట్నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



నూతనంగా నిర్మించిన మల్లికార్జునస్వామి ఆలయం

పొదలకూరు : మరుపూరులో పునర్నిర్మించిన కామాక్షి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను ఈ 29 నుంచి జూన్ 1వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వైస్ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వళ్లూరు గోపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. 400 ఏళ్ల నాటి కాశీవిశ్వనాథస్వామి(శివాలయం) ఆలయం శిథిలావస్థకు చేరడంతో దాతల సహకారంతో కోట్లాది రూపాయలతో పునర్నిర్మించినట్లు చెప్పారు. ఈ నెల 29న సాయంత్రం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, బింబశుద్ధి, గ్రామోత్సవం, 30న ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర స్వామి పూజ, శైవశుద్ధి, మహాపుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, రక్షావిధి, దీక్షాస్వీకరణ, యాగశాల ప్రవేశం, కాలబలి, అఖండస్థాపన, యంత్రమంత్రానుష్టానం ప్రారంభం, త్రిశూలపూజ, బింబశుద్ధి పూజ, హారతి, మంత్రపుష్పం, సాయంత్రం 6 గంటలకు విఘ్నేశ్వరపూజ నిర్వహించనున్నట్లు వివరించారు. 31న ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వరస్వామి పూజ, కైలాస మండపారాధన, సాయంత్రం 6 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, జూన్ 1న వేకువన 5 గంటలకు విఘ్నేశ్వర పూజ, శైవశుద్ధి మహాపుణ్యాహవాచనం, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, కళాన్యాసం, జీవన్యాసం, కామాక్షి సమేత మల్లికార్జునస్వామి శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఉత్సవాలకు హాజరవుతారని తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరంతో మానసికోల్లాసం



మనుబోలు: విద్యార్థుల మానసికోల్లాసానికి వేసవి విజ్ఞాన శిబిరం ఎంతో దోహదపడుతుందని మనుబోలు గ్రంథాలయాధికారి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. మనుబోలు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. యోగా ట్రైనర్ కోటేశ్వరరెడ్డి విద్యార్థులతో యోగా సాధన చేయించారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఆవశ్యకతను వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నూతన కార్యవర్గానికి సన్మానం

కోవూరు: కోవూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని ఆర్‌బీకేల్లో పనిచేస్తున్న గ్రామవ్యవసాయ సహాయకుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్ర, సాయి మహేష్ పేర్కొన్నారు. కోవూరులో శనివారం నిర్వహించిన వీఏఏ అసోసియేషన్ సమావేశంలో వారు మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం కోవూరు సబ్ డివిజన్ అసోసియేషన్ నాయకులుగా కొడవలూరుకు చెందిన పృథ్వీ, బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన అనితను ఎన్నుకున్నారు. జిల్లా అసోసియేషన్ నాయకులు ప్రసాద్, కళ్యాణి, సురేంద్ర పాల్గొన్నారు.

వైభవంగా చప్పరోత్సవం



విశేషాలంకారంలో చాముండేశ్వరిదేవి

ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి చప్పరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని పుష్పాలతో విశేషంగా అలంకరించి చప్పరంపై కొలువుదీర్చి ఉత్సవం జరిపారు. ఉభయకర్తలుగా కర్పూరం సోదరులు వ్యవహరించారు. కాగా శుక్రవారం రాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రి వెంకటేశ్వర్లు, పద్మమ్మ దంపతులు ఉభయకర్తలుగా అమ్మవారికి పూలాంగిసేవ నిర్వహించారు. ఇందుకూరుపేట సహకార బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, సోదరుడు శ్రీధర్‌రెడ్డి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు సర్వేపల్లిలో మంత్రి కాకాణి బహిరంగ సభ



మాట్లాడుతున్న మందల వెంకటశేషయ్య

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లిలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం బహిరంగ సభ నిర్వహించనున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని 89 గ్రామ సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి కాకాణి విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామవలంటీర్లు, తదితరులకు ధన్యవాదాలు తెలిపేందుకు సర్వేపల్లిలో బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. సాయంత్రం 5గంటలకు సర్వేపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి మంత్రి భారీ ర్యాలీగా బయలుదేరి వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకుని బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.

బహిరంగ సభ విజయవంతానికి పిలుపు

సర్వేపల్లి నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసిన సందర్భంగా సర్వేపల్లిలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి మందల వెంకటశేషయ్య పిలుపునిచ్చారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కనుపూరు సర్పంచ్ నాటకం శ్రీనివాసులు, ఏఎంసీ డైరెక్టర్ చీకుర్తి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణి సభ జయప్రదానికి పిలుపు

మనుబోలు: వెంకటాచలం మండలం సర్వేపల్లిలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని మనుబోలు ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సచివాలయం వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా ముగిసిన సందర్భంగా నిర్వహిస్తున్న సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు గుంజి రమేష్, దాసరి మహేంద్రవర్మ, తదితరులు ఉన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కృష్ణ

వెంకటాచలం: సచివాలయ ఉద్యోగులు విధులను సక్రమంగా నిర్వర్తించాలని తహసీల్దార్ కృష్ణ సూచించారు. మండలంలోని కాకుటూరు గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయానికి వచ్చిన అర్జీలు, వాటిలో ఎన్నింటిని పరిష్కరించారో రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులకు సూచించారు. అర్జీదారులను పదే పదే తిప్పుకోకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. పరిష్కారానికి వీల్లేని వాటి గురించి వెంటనే అర్జీదారులకు అర్థమయ్యేలా వివరించాలన్నారు.

పోలేరమ్మ జాతర ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



పోలేరమ్మ జాతర ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న విజయభానురెడ్డి

విడవలూరు(కోవూరు): విడవలూరు మండలం పెద్దపాళెంలో గ్రామదేవత పోలేరమ్మ జాతర మహోత్సవాన్ని ఈ నెల 31 నుంచి 4వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్ద కాపులు తెలిపారు. శనివారం పోలేరమ్మ జాతర ఆహ్వాన పత్రికలను ఏఎంసీ మాజీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. సర్పంచ్ మేకల పోలయ్య, పెద్దకాపు కొండూరు శ్రీనివాసులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న జేడీఏ సుధాకర్‌రాజు

కోవూరు: గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు కోరారు. మండలంలోని గుమ్మళ్లదిబ్బ రైతు భరోసా కేంద్రంలో కోవూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని వీఏఏలకు శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ మొదటి వారంలో ఈ-పంట నమోదు ప్రారంభమవుతుందన్నారు. అందువల్ల ఇప్పటి నుంచే రైతుల వివరాలను సేకరించుకోవాలని సూచించారు. ఈ నెల 30న ప్రభుత్వం రైతు భరోసా-పీఎం కిసాన్ నగదును విడుదల చేయనుందని తెలిపారు. అనంతరం జిల్లా వనరుల కేంద్రం ఉపసంచాలకులు సత్యవాణి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రైతులను సేంద్రియ సాగు పద్ధతుల వైపు ప్రోత్సహించాలని కోరారు. ఏఓలు లక్ష్మీమాధవి, సుజాత, చక్రవర్తి, కృష్ణయ్య, ఇందిరావతి, తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సీడ్స్ కేంద్రం తనిఖీ

పాటూరులోని సింహపురి సీడ్స్ కేంద్రాన్ని జేడీఏ సుధాకర్‌రాజు శనివారం తనిఖీ చేశారు. సీడ్స్ నాణ్యతను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని సూచించారు.


మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సెబ్ సీఐ బాలకృష్ణ

ఇందుకూరుపేట: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, యువత వాటికి దూరంగా ఉండాలని ముత్తుకూరు సెబ్ సీఐ బాలకృష్ణ సూచించారు. మైపాడులో మాదక ద్రవ్యాలతో కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెబ్ ఎస్పీ (అడ్మిన్) హిమవతి ఆదేశాల మేరకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితో సమాజంలో గౌరవం కోల్పోతారన్నారు. కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నా, తీసుకుంటున్నా టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రమణయ్య, సర్పంచ్ వెంకయ్య పాల్గొన్నారు.

విడవలూరులో ఓ మోస్తరు వర్షం



కోవూరు(విడవలూరు): విడవలూరు మండలంలో శనివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం ఎండవేడితో ప్రజలు అల్లాడారు. మధ్యాహ్నం వేళ వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఓ మోస్తరు వర్షం కురవడంతో ప్రజలు సేదతీరారు. వర్షంతో ఖరీఫ్ సాగుచేస్తున్న రైతులకు ఎటువంటి నష్టం లేదని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.